క్లుప్తంగా

ఓటర్ల జాబితా సర్వే వేగవంతం చేయాలి



శావల్యాపురం: ఓటర్ల జాబితా సర్వే వేగవంతం చేయాలని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు బీఎల్‌వోలకు సూచించారు. మండలంలోని కనమర్లపూడి, గంటావారిపాలెం గ్రామాల్లో శనివారం ఆయన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 21 వరకు ఓటర్ల జాబితా పరిశీలన సమర్థంగా చేపట్టాలని చెప్పారు. ప్రతిరోజూ బీఎల్‌వోలు 25 నుంచి 30 ఇళ్లను సర్వే చేయాలని, అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు కూడా సహకారాన్ని అందించాలని కోరారు. ఆయనతో పాటు ఆర్‌ఐ చంద్రబాబు, వీఆర్వో ఉప్పుటూరి చిన మంగయ్య ఉన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



నరసరావుపేట ఈస్ట్: అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు కాసా రాంబాబు ఆవిష్కరించారు. విద్యార్థులు, విద్యా రంగం సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ నిరంతర పోరాటాలు చేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎం.వాగ్యానాయక్, మధు, సాయి, ఉమర్‌రాజా పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీవారికి పూజలు



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో గల శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో శ్రీవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమాన్ శ్రీ చిత్రకవి శ్యాము ఆచార్యులు రామానుజ దాసన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యుత్ శాఖ ఏఈగా సురేష్

నకరికల్లు: మండల విద్యుత్ ఏఈగా సురేష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న రూఫస్ డానియేల్ బదిలీపై వెళ్లడంతో ఆ స్థానంలో మార్కాపురం నుంచి వచ్చిన సురేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు, వినియోగదారులకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

నేడు వైద్య శిబిరం

క్రోసూరు: సత్తెనపల్లి శాంతినికేతన్ జూనియర్ కాలేజీలో ఆదివారం ఏవీఎస్ హాస్పిటల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో వెరికోస్‌వెయిన్స్ వ్యాధిపై ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ సభ్యుడు కట్టమూరి అప్పారావు శనివారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం జరుగుతుందని తెలిపారు. వివరాలకు 99895 27715, 040- 22227799లను సంప్రదించాలని ఆయన సూచించారు.

రెండు వార్డులు వైఎస్సార్ సీపీ కైవశం

రెంటచింతల: మండలంలోని తుమృకోట, మల్లవరం గ్రామాల్లోని రెండు వార్డుల ఉప ఎన్నికలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలైనట్లు ఎన్నికల అధికారులు ఈవోపీఆర్డీ సీహెచ్. రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి శనివారం తెలిపారు. తుమృకోట గ్రామంలో 14వ వార్డుకు దేవనబోయిన రామయ్య, మల్లవరం గ్రామంలో 5వ వార్డుకు గువ్వల శ్రీదేవి నామినేషన్ వేసినట్లు చెప్పారు. ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో ఈ నెల 14వ తేదీన వారికి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాన్ని అందచేయనున్నట్లు వారు తెలిపారు. వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులుగా దేవనబోయిన రామయ్య, గువ్వల శ్రీదేవి నామినేషన్లు వేశారు.

150 మందికి బ్లడ్ గ్రూపుల పరీక్షలు

మాచర్ల: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రామకృష్ణ సేవా సమితి మాచర్ల ఆధ్వర్యంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత బ్లడ్ గ్రూపులు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కమిషనర్ ఈ.వి. రమణబాబు మాట్లాడుతూ స్వామి వివేకానంద సేవలు మరువలేనివన్నారు. 150 మందికి ఉచిత బ్లడ్ గ్రూపుల గురించి సమాచారం తెలిపారు. యువత ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి సెక్రటరీ పోలిశెట్టి పుల్లారావు, వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పవరపు గాంధీ, షేక్ లాలుసాహెబ్, ముత్యాల పాపిరెడ్డి, ఓరుగంటి చెన్నకేశవరావు, బొగ్గవరపు సత్యనారాయణ, మణి ల్యాబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి ద్వారా పేదల వైద్యానికి చేయూత

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



లబ్ధిదారులతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కుల్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి శనివారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. రొంపిచర్ల మండలంలోని రామిరెడ్డిపాలేనికి చెందిన కేతే నాగేశ్వరరెడ్డి ఇటీవల వెంకటాయపాలెంలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని కలసి బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న తన కుమారుడితో విషయం తెలియజేసి, సాయం చేయాలని అర్థించారు. సీఎం ఆదేశాలతో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ వైద్య కోసం తక్షణమే రూ.1లక్ష మంజూరు చేశారు. శనివారం ముఖ్యమంత్రి మంజూరు చేసిన మరో రూ.2,50లక్షల చెక్కు అందజేశారు. అదే మండలానికి చెందిన అరవపల్లి ఉమామహేశ్వరరావుకు రూ.2లక్షలు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ వేలాది పేద, మధ్య తరగతి ప్రజలకు ఏటా సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూతనందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో వందలాది మంది పేదలకు వైద్యసేవల కోసం సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చపారపు గోపాలరెడ్డి, రామిశెట్టి కొండ పాల్గొన్నారు.

జేవీవీ డివిజన్ నూతన కార్యవర్గం



చెరుకూరి సృజన



కల్లి శ్రీనివాసరెడ్డి

చిలకలూరిపేట: పట్టణంలోని సిద్ధయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జనవిజ్ఞాన వేదిక చిలకలూరిపేట డివిజన్ మహాసభ నిర్వహించారు. ఇందులో చిలకలూరిపేట డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షురాలిగా చెరుకూరి సృజన, ప్రధాన కార్యదర్శిగా కల్లి శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. గతంలో యడ్లపాడు మండల కన్వీనర్‌గా ఉన్న సృజన ప్రస్తుతం డివిజన్ అధ్యక్షురాలయ్యారు. గతంలో డివిజన్ ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి అదే పదవిలో కొనసాగుతున్నారు. కోశాధికారిగా షేక్ రహీంను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జేవీవీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు, కోశాధికారి ఏ.వి. శివయ్య, నాయకులు బెల్లంకొండ వీరాంజనేయులు, డాక్టర్ కొల్లా అమర్, డాక్టర్ పి.వి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

ముగిసిన వార్డు మెంబర్ల నామినేషన్ ప్రక్రియ

బొల్లాపల్లి : మండలంలో రెండు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న రెండు వార్డులకు నామినేషన్ల ప్రక్రియ ముగిసిందని ఆర్వోలు తెలిపారు. లాలిపురం పంచాయతీలో 2వ వార్డుకు ఉస్తాల దుర్గాభవాని నామినేషన్ దాఖలు చేసినట్లు ఆర్వో బి.సైదావలి తెలిపారు. సరైన సమయంలో కులధ్రువీకరణ పత్రం సమర్పించక పోవడంతో తిరస్కరణకు గురైందని ఆయన చెప్పారు. నెహ్రూనగర్ తండా పంచాయతీలో 1వ వార్డుకు మూడావత్ నానునాయక్ నామినేషన్ పత్రం దాఖలు చేసినట్లు ఆర్వో జి.రామాంజనేయులు తెలిపారు.

విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి



కోటిరెడ్డి మృతదేహం

రొంపిచర్ల : విద్యుత్ షాక్ గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో సంతగుడిపాడులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి పోలీసులు శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో సంతగుడిపాడుకు చెందిన రామాల కోటిరెడ్డి(55) గ్రామంలో హైవే రోడ్డు పక్కన గల మేజర్ కాలువ వద్ద బడ్డీ కొట్టు పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నారు. ఈదురు గాలులకు చెట్టు కొమ్మ విరిగి విద్యుత్ వైర్ల మీద పడి తెగిపోయాయి. ఆ సమయంలో కోటిరెడ్డి బయటకు వెళ్లడంతో వైర్లు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. మరుసటి రోజు కొట్టు దగ్గరకు వచ్చిన వారు కోటిరెడ్డి మృతదేహం చూసి గ్రామస్తులకు సమాచారం తెలియజేశారు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. మృతదేహంపై పడి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ జి. అంకారావు, ఎస్.ఐ సురేష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్. సురేష్ తెలిపారు.

తెలంగాణ మద్యం పట్టివేత

నరసరావుపేట టౌన్: అక్రమంగా మద్యం నిల్వ కేసులో నిందితుల్ని అరెస్టు చేసి 96 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్రబాబు శనివారం తెలిపారు. అందిన సమాచారం మేరకు శ్రీనివాసనగర్‌లో దాడులు నిర్వహించి, అక్రమంగా తెలంగాణ మద్యం కలిగి ఉన్న వెంకటేష్, కృష్ణను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

రొంపిచర్లలో 4.2 మి.మీ. వర్షపాతం నమోదు

రొంపిచర్ల: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మండల కేంద్రమైన రొంపిచర్లలో శనివారం ఉదయానికి 4.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. విప్పర్ల, రెడ్డిపాలెం, కొత్తపల్లి, మర్రిచెట్టుపాలెం, దాసరిపాలెం, మాచవరం గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది.

నేడు మాచవరం, సుబ్బయ్యపాలెంలో ఎమ్మెల్యే పర్యటన

రొంపిచర్ల: మండలంలోని మాచవరం, సుబ్బయ్యపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం పర్యటిస్తారని ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ తెలిపారు. ఉదయం 11 గంటలకు మాచవరం కాలనీలో నూతనంగా నిర్మించనున్న చర్చి శంకుస్థాపనలో, సాయంత్రం 5 గంటలకు సుబ్బయ్యపాలెంలో నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కన్వీనర్లు, గృహసారథులు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేరాల నియంత్రణకు సమగ్ర చర్యలు: డీఎస్పీ

నాదెండ్ల: మండలంలోని నాదెండ్ల పోలీస్ స్టేషన్‌ను నరసరావుపేట డీఎస్పీ కె.వి.మహేష్ శనివారం సందర్శించారు. చిలకలూరిపేట రూరల్ సీఐ వై. అచ్చయ్య, ఎస్ఐ జె. బలరామిరెడ్డి, సిబ్బందితో సమావేశమయ్యారు. రికార్డులు పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, దర్యాప్తు తీరును ఆరా తీశారు. నేరాల నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. గుంటూరు-కర్నూలు రాష్ట్రీయ రహదారి, కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారు. దొంగతనాల నియంత్రణకు ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాల్ని స్థానిక నాయకుల సహకారంతో ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల తనిఖీ, పాన్‌పరాగ్, గంజాయి తదితర మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ట నిఘా ఉంచాలని ఆదేశించారు.

జిల్లాలో తెలుగు భాషాభ్యున్నతికి విశేష కృషి

కలెక్టర్, ఎమ్మెల్యేను కలసిన అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యుడు డాక్టర్ కత్తి

నరసరావుపేట: తెలుగు భాష అభ్యున్నతి, సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగింపుగా జిల్లాలో పలు కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ చెప్పారు. ఇటీవల అధికార తెలుగు భాష సంఘం రాష్ట్ర సభ్యుడిగా నియమితులైన డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు వారిని కలెక్టరేట్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నెలనెలా సాహిత్యమేళా అనే అంశంపై తెలుగు భాష సాహిత్య సమాలోచన కార్యక్రమాల్ని రూపొందించి, భాషా వికాసానికి తోడ్పాటు అందిస్తున్నట్లు వివరించారు. ప్రతి నెలా మూడో శుక్రవారం సుప్రసిద్ధ సాహితీకారులతో తెలుగు సాహిత్యంలో విశేష సేవలు అందించిన ప్రముఖుల జీవిత చరిత్రలు, వారి సాహితీ కృషిని ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ ఏడాది ఉగాది పురస్కారాలు అందజేశామని, ఎమ్మెల్యే, కలెక్టర్ కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో సాహితీకారులకు సత్కారాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనెల 29న గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా నిర్వహించనున్న తెలుగు భాషా దినోత్సవంలో పల్నాడు జిల్లావ్యాప్తంగా తెలుగు భాషకు విశిష్ట సేవలు అందించిన వారికి గిడుగు పురస్కారాల్ని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పురస్కారాల సందర్భంగా తెలుగు భాష అభ్యున్నతికి కృషి చేసిన రచయితలకు, ఎంపికైన సాహితీవేత్తలకు నగదు బహుమతి అందజేస్తున్నట్లు ప్రకటించారు. నూతనంగా అధికార భాష సంఘం సభ్యుడిగా నియమితులైన డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లును ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కె.వేణుగోపాల్, రిటైర్డ్ ఉపాధ్యాయులు లింగిశెట్టి నాగేశ్వరావు, కోటప్పకొండ తెలుగు ఉపాధ్యాయుడు బి.శాంసన్, ఎలిమెంటరీ ప్రధానోపాధ్యాయుడు షేక్ సయ్యద్ జాని పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు మార్కొండారెడ్డి

మాచర్ల రూరల్: ఆరుగాలం శ్రమించే రైతన్నల సంక్షేమం కోసం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వారి వద్దకే సంక్షేమ పథకాలు అందించే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కుర్రి సాయి మార్కొండారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని జమ్మలమడక గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతన్నల శ్రేయస్సు కోసం ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి వారికి నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై అందించటమేకాకుండా వ్యవసాయాధికారులను నియమించి వారి ద్వారా రైతులకు విలువైన సలహాలను అందిస్తున్న నాయకుడు సీఎం జగన్ అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వారికి అవసరమైన ఎరువులు, విత్తనాలు ప్రతి ఆర్‌బీకేలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఆర్‌బీకే ఉద్యోగులు నిత్యం రైతులకు అందుబాటులో ఉండి జవాబుతనంగా వ్యవహరించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు తిప్పారెడ్డి గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ పరిమళ ఏసోబు, వైఎస్సార్ సీపీ నాయకులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాదారులకు న్యాయం చేయాలి

సీపీఎం పల్నాడు జిల్లా సభ్యుడు రవిబాబు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు చైతన్య గోదావరి బ్యాంకులో తనఖా బంగారం వస్తువుల గోల్‌మాల్ పై సమగ్ర విచారణ జరిపి ఖాతాదారులకు న్యాయం చేయాలని సీపీఎం శనివారం డిమాండ్ చేసింది.

ఈ మేరకు దొడ్లేరు బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఎం పల్నాడు జిల్లా వర్గ సభ్యుడు జి.రవిబాబు మాట్లాడారు. బ్యాంకులో తనిఖీకి వచ్చిన అధికారులతో ఈ విషయమై చర్చించినట్లు చెప్పారు. బ్యాంకులో బంగారం అప్రైజర్‌గా పనిచేసిన నాగార్జున పథకం ప్రకారం ప్రతి గ్రామానికి కొంతమంది బినామీలను పెట్టుకుని వారితో లావాదేవీలు నడిచేటట్లుగా ఏర్పాటు చేసుకున్నట్లు అధికారులు తెలిజేశారన్నారు. తాకట్టు పెట్టుకున్న ఖాతాదారులు రెన్యువల్ చేసుకున్న సమయంలో అసలు రశీదులు ఇవ్వలేదని, ఇచ్చినా ఆభరణాల వివరాలు రాయలేదని గుర్తించినట్లు చెప్పారన్నారు. బ్యాంకు మేనేజరు, కిందిస్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా అప్రైజర్ నాగార్జున బంగారం వస్తువుల్లో అవకతవకలకు పాల్పడి తన బినామీల పేర్లతో బ్యాంకులోనే తనఖా పెట్టినట్లు అధికారులు చెప్పినట్లు తెలిపారు. ఖాతాదారులు తమ బంగారం వస్తువులు ఉన్నాయా.. లేవా ? తెలుసుకునేందుకు వచ్చే నెల 3 వ తేదీ వరకు తనిఖీ అధికారులు స్లిప్పులు ఇచ్చినట్లు తెలిపారు. అప్పటి వరకు ఖాతాదారులు తమ వస్తువులు ఏమయ్యాయోనని తీవ్ర మానసిక ఆందోళన చెందే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. బ్యాంకు తనిఖీ అధికారులు ఖాతాదారులతో సమావేశం నిర్వహించి వారికి పూర్తి భరోసా కల్పించాలని రవిబాబు కోరారు. ప్రతి ఖాతాదారుడికీ గ్రాము బంగారం కూడా నష్టం జరగకుండా బ్యాంకు అధికారులు పూర్తి భరోసా కల్పిస్తూ న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు, సీపీఎం నేతలు పాల్గొన్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సుల ఏర్పాటు

మాచర్ల: నియోజకవర్గ పరిధిలోని భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ మాచర్ల బస్సు డిపో నుంచి తమిళనాడులోని అరుణాచలం వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం పిచ్చయ్య తెలిపారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రత్యేక బస్సుల వివరాలు వెల్లడించారు. ఈ నెల 29 నుంచి రాత్రి 7 గంటలకు అరుణాచలానికి బస్సు బయలుదేరుతుందని చెప్పారు. 30న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం దర్శనం, 31న అరుణాచలేశ్వరుని దర్శనం అనంతరం సాయంత్రం తిరుగు ప్రయాణమవుతుందన్నారు. తిరిగి సెప్టెంబర్ 1న ఉదయం 7గంటలకు మాచర్లకు బస్సు చేరుతుందన్నారు. ఒక్కొక్కరికీ రానుపోను టికెట్ ధర రూ. 2750 మాత్రమేనన్నారు. గతంలో రూ. 3150 ఉన్న టికెట్ ధరను తగ్గించినట్లు డీఎం పిచ్చయ్య చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 9959225432, 7382801048, 7382895100ను సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్ సీపీతోనే మాదిగలకు న్యాయం

మాచర్ల: నియోజక వర్గంలో మాదిగల్ని గుర్తించి గౌరవించినది పిన్నెల్లి కుటుంబమని మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు అన్నారు. శనివారం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్లు, నాయకులతో కలసి మున్సిపల్ కౌన్సిల్ హాలులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాబోయే రోజుల్లో ప్రతి మాదిగ కుటుంబం వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ పీఆర్కేలను గెలిపించుకునే బాధ్యతను తీసుకోవాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్ మందా సంతోష్, ఎస్సీ విభాగ కౌన్సిలర్లు వేల్పుల విజయమేరి, కలివెల జ్యోతి, గెల్లెపోగు జగన్నాథం, వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ విభాగ నాయకుడు బొంగురు, కలివెల రాజు పాల్గొన్నారు.

ఆనంద జీవనానికి యోగా



శిబిరం ముగింపు సమావేశంలో పాల్గొన్న అభ్యాసకులు

నరసరావుపేట ఈస్ట్: ఆనంద జీవనానికి యోగా దోహదపడుతుందని శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్రం వ్యవస్థాపకుడు వేంకటేశ్వర గురూజీ తెలిపారు. యోగా సేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో 28రోజుల పాటు నిర్వహించిన ఉచిత శిక్షణ శిబిరం ముగింపు సమావేశాన్ని శనివారం శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహించారు. అభ్యాసకుల్ని ఉద్దేశించి వేంకటేశ్వర గురూజీ మాట్లాడుతూ అభ్యాసకులు శిబిరంలో పొందిన యోగ శిక్షణను నిత్యం కొనసాగించడం ద్వారా పంచసిద్ధి లభిస్తుందని తెలిపారు. మానసిక, శారీరక రుగ్మతలు తొలగి జీవితాంతం ఆనందంగా జీవించవచ్చని వివరించారు. కార్యక్రమంలో శిబిరం యోగా గురూజీ కూనిశెట్టి వెంకట జనార్దన్, చిలకలూరిపేట శాఖ గురూజీ కాపుగంటి శివప్రసాద్, కన్వీనర్ అనూరాధ, సహాయ బోధకులు జల్లి శ్రీనివాసరావు, కోట మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఇంటింటికీ ఓటరు సర్వేను వేగవంతం చేయాలి

బీఎల్వోలను ఆదేశించిన ఆర్డీవో యం.శేషిరెడ్డి

రొంపిచర్ల: ఇంటింటికీ ఓటరు సర్వేను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆర్డీవో యం.శేషిరెడ్డి బీఎల్వోలను ఆదేశించారు. మండలంలోని పరగటిచర్ల, నల్లగార్లపాడు గ్రామాల్లో శనివారం ఆయన సర్వేను ఎమ్మార్వో అంకారావుతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లో కొత్తగా నమోదైన ఓట్లు, చనిపోయిన ఓటర్ల తొలగింపు, జాబితాలో మార్పులు, చేర్పులతో పాటు ఇప్పటి వరకు అందిన దరఖాస్తు వివరాల్ని బీఎల్వోల ద్వారా తెలుసుకున్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకే ఇంటి నంబర్‌పై ఎక్కువ ఓట్లు నమోదైతే పంచాయతీ అధికారులతో కలసి ఆయా ఇళ్లకు వెళ్లి విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఇంటింటికీ చేపట్టిన ఓటర్ల సర్వేపై బీఎల్వోలకు ఓటర్లు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం ఎమ్మార్వో అంకారావు మాచవరం, విప్పర్లరెడ్డిపాలెం, సంతగుడిపాడు, రొంపిచర్ల, తుంగపాడు, అన్నవరం గ్రామాల్లో సర్వేను కార్యక్రమాన్ని పర్యవేక్షించి, బీఎల్వోలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఆయా గ్రామాల వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వినుకొండ(నూజెండ్ల): హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మొక్కలు పెంచడం, ప్లాస్టిక్ నిషేధం, నీటిని జాగ్రత్తగా వాడటం తదితర అంశాలపై ప్లకార్డులు చేతబూని కరపత్రాల్ని పంచుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, సామూహిక గ్రూపు చర్చలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం అరుంధతి కాలనీ, హనుమాన్‌నగర్, డ్రైవర్స్ కాలనీ, మసీదు మాన్యం కాలనీల్లో పర్యావరణ పరిరక్షణపై పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యోగి, అధ్యాపకులు, సంస్థ సిబ్బంది విద్యారావ్, ఆశ, సంధ్య, షాహీదా, కొండలు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలకు స్పందన

రొంపిచర్ల: 76వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక భగత్‌సింగ్ భవన్ ఆధ్వర్యంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు శనివారం 'రాజ్యాంగ విలువలు- నేటి పరిస్థితి' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 78 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.2 వేలు, రూ.1000, రూ.500తో పాటు నాలుగు కన్సోలేషన్ బహుమతులు ఇవ్వనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గోగులపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థిని జి. రామతులసి మొదటి బహుమతి, వి.రెడ్డిపాలెం జెడ్పీ పాఠశాలకు చెందిన సీహెచ్. భార్గవి, ఎం. భార్గవ్ ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపికయ్యారని చెప్పారు. విజేతలకు ఆగస్టు 15న పాఠశాలలకు వెళ్లి బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్. రామకృష్ణంరాజు, శేషంరాజు, మస్తాన్‌వలి, శివరాం, వెంకట సుబ్బరాజు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు ఇంటింటా సర్వే చేయాలి

ఆర్డీవో రాజకుమారి



ఇంటింటి సర్వే పర్యవేక్షిస్తున్న, ఆర్డీవో బీఎల్ఎన్ రాజకుమారి, తహసీల్దార్ నగేష్

రాజుపాలెం: ఓటరు నమోదు కోసం గ్రామంలో ఇంటింటికి సర్వే చేయాలని సత్తెనపల్లి ఆర్డీఓ బి.ఎల్ఎన్ రాజకుమారి తెలిపారు. మండలంలోని కోట నెమలిపురి, కొండమోడు గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల సర్వేను ఆర్డీఓ శనివారం పరిశీలించారు. సర్వే బృందం వెంట ఆర్డీఓ వెళ్లి ఇంటింటా సర్వే చేశారు. గ్రామస్తులను సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన యువతీ, యువకుల ఓటును తప్పనిసరిగా చేర్చాలని బీఎల్వోలకు సూచించారు. ప్రతీ ఓటరుకు డోర్ నంబర్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. చనిపోయిన వారిని గుర్తించి ఓటర్ల జాబితా నుంచి తొలగించాలన్నారు. గ్రామం విడిచి వెళ్లిన వారిని గుర్తించి గ్రామంలో విచారించిన తరువాతనే ఓటును తొలగించాలని చెప్పారు. గ్రామ వలంటీర్లను సర్వే బృందం వెంట ఉంచుకోవద్దని, వారి ప్రమేయం లేకుండా చూడాలని సూచించారు. ఆర్డీఓ వెంట తహసీల్దారు నళిని, పిఎస్ శ్రీనివాసరావు, వీఆర్వో వెంకటనారాయణ, బీఎల్వోలు దుర్గా ప్రసాద్, కనకదుర్గ ఉన్నారు.

సర్వే తప్పులతడకలు లేకుండా చేపట్టాలి

నకరికల్లు: ఇంటింటి సర్వేను తప్పుల తడకలు లేకుండా సమర్థవంతంగా చేపట్టాలని ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారి సూచించారు. మండలంలోని నకరికల్లు, గుండ్లపల్లి, నర్సింగపాడు గ్రామాల్లో ఎస్ఎస్ఆర్ 2024 ఇంటింటి సర్వేను శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా చేర్చుకునే ఓట్లు, మృతి చెందిన వారి ఓట్లు, మార్పులు, చేర్పులకు సంబంధించి బీఎస్ఓలు సర్వే నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలన్నారు. మృతిచెందిన ఓటరు వివరాలు, పర్మినెంటు షిఫ్టులకు సంబంధించిన వివరాలు పొందుపరిచేందుకు ఫారం-7 వినియోగించాలన్నారు. నివేదికలను తప్పులతడకలు లేకుండా కార్యాలయానికి పంపాలన్నారు. 10 కన్నా ఎక్కువ ఓటర్లు నమోదైన ఇంటినంబర్‌ను ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

దూరవిద్యలో ప్రవేశాలకు దరఖాస్తు

గురజాల : దూరవిద్య పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నటుల్లు ప్రధానోపాధ్యాయులు ఆశాలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-2024 సంవత్సరానికి గాను ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి చేరే వారు 14 సంవత్సరాలు, ఇంటర్మీడియట్‌లో చేరే వారు 15 సంవత్సరాలు నిండి ఉండాలని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం: 93987 10992 సంప్రదించాలని సూచించారు.